# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 158 | విశాఖపట్నం | 10-3-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 158 | VISAKHAPATNAM | 10-3-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## విశాఖ జిల్లాలో బరితెగించిన అక్రమార్కులు..

# అక్రమ కట్టడాలతో జీవీఎంసీ ఆదాయనికి గండికొడుతున్న కేటుగాళ్లు




- ప్లాన్ ఉంది.. ప్లాన్ ఒక దగ్గర ఉంటే.. కట్టేది ఇంకో దగ్గర
- జీవీఎంసీ అధికారులకు తెలియకుండా కట్టేస్తున్నారా!! తెలిసే చోద్యం చూస్తున్నారా!!
- ప్లాన్ లేదు, అంతా నా ఇష్టం, నన్ను ఎవరు అడుగుతారు.. నా వెనక పొలిటీషియన్స్ ఉన్నారంటున్న అక్రమార్కులు
- వేపగుంట, సింహంపూరి కాలనీలో అక్రమ కట్టడం
- చూసి చూడనట్టు వదిలేసిన జీవీఎంసీ అధికారులు!
- ఎంత ముడుపులు తీసుకున్నారో తెలియాల్సి ఉంది!
- జోన్-8లో అసలు అధికారులు ఉన్నారా లేరా!
- బి అరుణ్ కుమార్ పేరిట అక్రమ కట్టడం కట్టేస్తున్నా మాకెందులే అంటున్న జీవీఎంసీ అధికారులు!

## జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఆర్‌టీఐ కార్యకర్త

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ జిల్లా, వేపగుంట మండలం,సింహపూరి కాలనీలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తారు అనడానికి ఇదే నిదర్శనం. బి.అరుణ కుమారి పేరిట కడుతున్న అక్రమ కట్టడం. B.A.NO.PER /1086/0085/2025 జీవీఎంసీ జోన్-8లో జి ప్లస్ టు పేరుతో దర్జాగా కమర్షియల్ షాపింగ్ మాల్ కడుతున్నా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు అంటే అక్రమ కట్టడాలు వెనుక ఎవరూ ఉన్నారో.. అధికారుల మౌనానికి కారణాలు ఏమిటో నిగ్గు తేల్చాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సెట్ బ్యాక్ అన్ని అక్రమాలే కమర్షియల్ కాంప్లెక్ పేరుతో జీవీఎంసీని మోసం చేసిన అరుణకుమారి. ఎటూ చూసినా అక్రమాలే. కళ్ల ముందే అక్రమ కట్టడం జరుగుతున్నా మామూళ్లు మత్తులో జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. జీవీఎంసీకి ఆదాయానికి గండి కొట్టి అక్రమంగా నిర్మిస్తున్న అరుణకుమారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆర్.టి.ఐ కార్యకర్త డిమాండ్ చేసారు. వెంటనే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## పీపీపీ పద్ధతిలో వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు: నారాయణ



**నెల్లూరు, డెక్కన్ న్యూస్:** సోమవారం నెల్లూరు జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో కోటి 53లక్షల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయని అన్నారు. మొత్తం చెత్తని క్లియర్ చేయమని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నారాయణ అన్నారు. ఇప్పటికీ కోటీ 15లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 10 వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు మొదలుపెట్టామని.. వాటిలో రెండు పూర్తి చేశామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో మిగిలిన వాటిని పూర్తిచేసి ఉంటే, ఈ పరిస్థితి ఉండేది కాదని చెప్పుకొచ్చారు. ఏపీలోని ప్రధాన నగరాల్లో పీపీపీ పద్ధతిలో వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## క్యూఆర్ కోడ్‌తో కొత్త పాసు పుస్తకాలు..

# తప్పులు వెంటనే తెలుస్తాయి: చంద్రబాబు

**నంద్యాల, డెక్కన్ న్యూస్:** ఒక్క పైసా కూడా అవినీతి లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ ట్యాంపరింగ్ జరగకుండా కొత్త పాసు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లా కొత్తబురుజు గ్రామసభలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. క్యూఆర్ కోడ్‌తో ఇచ్చే పాసు పుస్తకాలతో ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోందన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చుతాం: ప్రజలు అభిమానించే పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. సుస్థిరమైన పాలనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ట్రూఅప్ పేరుతో ప్రజలపై భారం మోపిందన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు పెంచమని పరిస్థితులు అనుకూలిస్తే తగ్గించే ప్రయత్నం చేస్తామని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. రాయలసీమను రతనాల సీమగా మార్చి, ఉద్యానవనంగా చేసి చూపిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెట్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.




'గత ప్రభుత్వ హయాంలో మద్యాన్ని కల్తీ చేసి వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. పేదవాడి ఆరోగ్యం కంటే వాళ్లకు డబ్బులే ముఖ్యమా? తిరుమల ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారు. తిరుమల పవిత్రతను దెబ్బతీయాలని చూశారు. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించను. ఇతర మతాల సంప్రదాయాలను కాపాడతాం. కుట్రపూరితంగా మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ప్రజల జీవితాలు, ఆరోగ్యంతో ఆడుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంతా కల్తీ కుంభకోణాలే. ముఠాలు వద్దు గ్రామాల ప్రశాంతతే ముద్దు అని అందర్నీ కలిపా. రౌడీయిజం, ముఠా కక్షలు లేకుండా చేశాం. రాయల సీమను రతనాల సీమగా మారుస్తా. ఉద్యానవనంగా చేసి చూపిస్తాం. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెట్ కల్పిస్తాం.' అని చంద్రబాబు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువాళ్లు ఉంటారని, నాడు ఐటీని అభివృద్ధి చేయడం (తరువాయి 2వ పేజీలో)

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన లోకేశ్



**మంగళగిరి, డెక్కన్ న్యూస్:** మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు లాంఛనంగా ఆవిష్కరించారు. సోమ వారం రేవేంద్రపాడు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగింది. విగ్రహా విష్కరణ తరువాత అక్కడ ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు లోకేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో ఆయన కాసేపు ముచ్చటించి, వారితో కలిసి ఫోటోలు దిగారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## నితీశ్ నిష్క్రమణ సంకేతాలు!

21 ఏళ్ల ముఖ్యమంత్రిత్వం. సగటున రెండేళ్లకోసారి అన్నట్టు పదిసార్లు ప్రమాణ స్వీకారం. సుశాసన్ బాబు బిరుదు, పల్టూబాబు అవహేళన. సోషలిస్టు నేపథ్యంతో మొదలై జనతా ప్రయోగంలో పెరిగి లాలూ ప్రసాద్ యాదవ్ నీడలో నలిగి చివరకు మోడీ నీడలో ముగుస్తున్న నితీశ్ కుమార్ రాజకీయ జీవితం సమకాలీన ప్రాంతీయ పాలక పార్టీల నేతల దుస్థితికి దర్పణం పడుతుంది. అదే సమయంలో రానున్న రాజకీయ మధనం ఎలా వుండేది సంకేతప్రా యంగా చెబుతుంది. ఈ సంకేతాల్లో తెలుగు రాష్ట్రాలతో సహా అనేక చోట్ల అవకాశవాద నాయకుల భవిష్యత్తు ఎలా వుండేది రేఖామాత్రంగా కనిపిస్తుంది. అంతగా కనిపించనిది ఈ మలుపులు, కదుపుల వెనక బిజెపి సంఘ పరివార్ రాజకీయాల బండారం. దానికి ఆధ్వర్యం వహిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ మల్లగుల్లాలు. ఈ పరిణామాల లోతుపాతులు చూడకుండా అంతా ఏకపక్షంగా చిత్రించే ధోరణులు వాస్తవికమైనవి కావు. ఏది ఏమైనా ఒకటి నిజం, చరిత్రలో మొదటిసారి బీహార్‌లో బిజెపి ప్రత్యక్షంగా ప్రభుత్వాధిపత్యం చేపట్టబోతున్నది. హిమాచల్ ప్రదేశ్ మినహా మొత్తం హిందీ రాష్ట్రాలన్నీ దాని పాలనలో వుండబోతున్నాయి. వచ్చే ఏడాది జరగాల్సిన ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఎన్నికలకూ ఈ ఏడాది జరిగే అస్సాం, పశ్చిమ బెంగాల్, శాసనసభ ఎన్నికలకూ ఇది లాభదాయకమని పరివార్ భావిస్తున్నది. లాలూ ప్రసాద్ యాదవ్‌ది కుటుంబ పాలన అనీ, తాను వాటికి అతీతంగా తన వాళ్లను దూరం వుంచానని గొప్పలు పోయిన నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ ఇప్పుడే జనతాదళ్ (యునైటెడ్) పార్టీ సభ్యుడై ఎకాఎకిన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టబోతున్నారు. అయితే ఆ పదవిలో వుండే ఇద్దరిలో ఒకరుగా మాత్రమేనని గుర్తుంచుకోవాలి. 2020, 2025 ఎన్నికల తర్వాత కేవలం తమ షరతుల మీద నితీశ్‌ను కుర్చీలో కూర్చోనిచ్చిన బిజెపి ఇక దిగిపోవాలని హుకుం చేయగానే ఆయన 'జీ హుజూర్' అని తప్పుకోవడం అనివార్యమే. తనకేదో రాజ్యసభలోనూ వుండాలని కోర్కె వుంది గనక ఇష్టంతో వెళు తున్నానని, ఎవరి ఒత్తిడి లేదని నితీశ్ ప్రత్యేకంగా ప్రకటించడం కన్నా అందుకు వేరే నిదర్శనం అక్కర్లేదు. అదే నిజమైతే ఇంత హఠాత్తుగా నాటకీయంగా జరిగివుండేది కాదు. 1975 ఎమర్జన్సీకి ముందు బీహార్‌లో జరిగిన విశాల ప్రజాస్వామిక ఉద్యమం నుంచి పుట్టిన ఇద్దరు కీలక నేతలు లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్‌ల ఆటుపోట్లలో దేశ రాజకీయాల మదనం కనిపిస్తుంది. బిజెపి ది సంఘ పరివార్ అయితే వారిది జనతా పరివార్ అనొచ్చు. మండల్ కమిషన్ నేపథ్యంలో బిసి వర్గాల సామాజిక సమీకరణల ఇందుకు నేపథ్యమైంది, మతతత్వ రాజకీయాలే ఈ రెండు పరివార్‌ల మధ్య ఒక తేడా అనుకుంటే లాలూ లౌకిక రాజకీయాలకు కట్టుబడ్డారు. పశు గ్రాసం కుంభకోణంతో సహా వున్నాయి గాని ఈ విషయంలో పక్కకు పోలేదు. యు.పి లో ములాయం సింగ్ యాదవ్ కూడా మధ్యలో ఊగిసలాటలున్నా బిజెపితో కలవలేదు. ఇందుకు పూర్తి భిన్నం నితీశ్ కుమార్ ప్రయాణం, అది కూడా మరీ అడ్డగోలు వ్యవహారం. మోడీని ప్రధాని అభ్యర్థిగానే అంగీరించబోనని 2014లో బీరాలు పలికి కూటములు మార్చి పదవి కాపాడుకున్న నితీశ్ తర్వాత 2017లో ప్లేటు ఫిరాయించి వుండకపోతే బీహార్‌లోనే గాక దేశంలో కూడా రాజకీయాలు మరోలా వుండేవేమో. 2022లోనూ ఆయన ఇదే పునరావృతం చేశారు. అందుకే ఆయనను 'పల్టు బాబు' అని ముద్దుపేరు వచ్చింది. ఈ విషయంలో తనతో పోటీ పడగలిగింది ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమే. ఈ ఇద్దరు నాయకులు మనుగడ కోసం బిజెపిని మోయకపోతే 2024లోనూ మోడీ మూడోసారి ప్రధాని కాగలిగేవారు కాదనవచ్చు. అరదుకు తగినట్టు వారేమైనా పట్టు పెంచుకోగలిగారా అంటే కనిపించని ఒత్తిడితో మోడీ వారిని ఆడిస్తూనే వస్తున్నారు. అనివార్య అవసరాల కోసం ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని తర్వాత వాటిని చప్పరించడం బిజెపి వ్యూహమని ఇప్పుడందరికీ తెలిసిపోయింది. వాజ్‌పేయి హయాంలో మమతా సమతా లలిత అని టిఎంసి, అన్నా డిఎంకె, సమతా పార్టీలు ఆడిస్తూనే వుండేవి. మొదటి రెండు సార్లు మెజార్టీ బిజెపికి వుంది గనక పోనీ అనుకున్నా వీరిపై ఆధారపడిన 2024లో కూడా అదే జరుగుతుందంటే చాలా కారణాలు, ఒత్తిళ్లు వున్నాయనేది స్పష్టం. ప్రాంతీయ పాలక పార్టీల అవకాశవాదమే బిజెపి విస్తరణకు ప్రాబల్యం పెరగడానికి ప్రధాన కారణం, కానీ మోడీ హయాంలో త్రిశూల వ్యూహాల దెబ్బకు దాన్ని మరింత జటిలం చేసింది. దేశంలో నలుమూలలా ఈ ఫార్ములాతోనే బిజెపి కాలూనడమే గాక వేళ్లు తన్నుకోగలిగింది. కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో ప్రాంతీయ నేతలే బాస్‌లన్నది మొదటి అవగాహన. కానీ 2019 నుంచి ఇది మారిపోయింది. శివసేనను చీల్చి ఏక్‌నాథ్ షిండేతో జతకట్టడం దీనికి మొదలనుకుంటే అజిత్ పవార్‌ను చీల్చి శరద్‌పవార్ ఎన్‌సిపిని నిర్వీర్యం చేయడం కూడా ఇందులో భాగమే. అస్సాం గణపరిషత్ (ఎజిపి) విషయంలోనూ అదే జరిగింది. నెమ్మదిగా కాంగ్రెస్ నుంచి హిమంత బిస్వ శర్మను తీసుకుని పట్టం కట్టింది.

## ఒలింపిక్స్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి అంతర్జాతీయ ప్రమాణాలు కల్పిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒలింపిక్స్, కామన్ వెల్త్ కోసం తెలంగాణ క్రీడాకారులకు పూర్తి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. క్రీడాశాఖపై సచివాలయంలో సోమవారం మంత్రులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఒలింపిక్స్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి అవుట్ డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించడంతోపాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. ఈ డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఒలింపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియాలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, శాట్స్ ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మంగళగిరి నులకపేటలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్



**గుంటూరు, పతాకం న్యూస్:** మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ ప్రారంభించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహకారంతో రూ.65 లక్షల సీఎస్‌ఆర్ నిధులు వెచ్చించి కమ్యూనిటీ హాల్ ను నిర్మించారు. ముందుగా నులకపేటకు చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కమ్యూనిటీ హాల్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.చంద్ర కిరణ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వన్‌స్టాప్ కేంద్రాన్ని ప్రారంభించిన అచ్చెన్నాయుడు



**టెక్కలి, పతాకం న్యూస్:** ఆపదలో ఉన్న మహిళలకు కూటమి ప్రభుత్వం అండగా ఉం టుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలిలోని జిల్లా ఆసుపత్రిలో వన్‌స్టాప్ కేంద్రాన్ని మంత్రి ప్రారం భించి మాట్లాడారు. మహిళల భద్రతకు రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు ఇకపై తక్షణమే సాయం అందుతుం దన్నారు. ఈ కేంద్రం 24 గంటలూ పనిచేస్తుందన్నారు. మహిళలందరికి ఒకే చోట వైద్యసేవలు, న్యాయ సేవలతోపాటు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వను న్నట్టు తెలిపారు. మహిళలు ఎక్కడకు తిరగాల్సిన అవసరం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల ఉన్నతికి ఆలోచిస్తుంటారన్నారు. టెక్కలి ఆయుష్ ఆసుపత్రిని నిర్మించనున్నట్టు తెలిపారు. టెక్కలి జిల్లా ఆసుపత్రికి మరో రెండు రోజుల్లో కొత్త సిబ్బందిని నియమిస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి కోరారు. అనంతరం బాల్యవివాహల విముక్తి ప్రచార రథం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమం లో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, ఐసీడీఎస్ పీడీ కె.రూపలత, టీడీపీ నాయకులు హరిప్రసాద్, బి.శేఖగిరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల గురించి జగన్ మాట్లాడడం హాస్యాస్పదం: మంత్రి సవిత



**పెనుకొండ, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిండు అసెంబ్లీలో తల్లి లాంటి నారా భువనేశ్వరిని అవమానించారంటూ మండిపడ్డారు. సొంత తల్లి, చెల్లికి, చిన్నాన్న కుమార్తెకు న్యాయం చేయని వ్యక్తి వైఎస్ జగన్ అని అభివర్ణించారు. ఇంట్లో వారిని బజారు పాలు చేశారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, దారుణాలు అంతా చూశారన్నారు. మహిళా ద్రోహి సీఎం చంద్రబాబు అంటూ జగన్ మాట్లాడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు పెట్టారంటూ సీఎంగా జగన్ వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా మంత్రి సవిత తూర్పారబట్టారు. హిందువులు, మహిళలు, బీసీల అభివృద్ధి అంటే సరిపోదంటూ జగన్‌కు చురకలంటించారు. మీ హయాంలో జరిగిన అరాచకాలపై నివేదిక తయారు చేసి గవర్నర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. రాయలసీమ సాగునీటి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని కుండ బద్దలు కొట్టారు. వారు రాయలసీమ ద్రోహులున్నారు. ఏ రోజు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ నాయకులు సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు, మహిళలు చాలా క్లారిటీగా ఉన్నారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది పూలే ఆ తర్వాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మంత్రి సబితా తెలిపారు. ఇప్పుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు మాత్రమే మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలకు అన్ని అంశాల్లో ప్రాధాన్యత కల్పించింది సీఎం చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ రావాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.

## ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ 41 వ గేటు వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకురావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఇతనికి కోల మొహం ఉండి, నలుపు రంగులో ఉన్నాడు. ప్రత్యేకంగా ఇతని ఒక్కో కాలికి 6 వేళ్లు, ఒక్కో చేతికి 7 వేళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే ధవలేశ్వరం ఈ 9440796586, 9491999336 ఫోన్ నెంబర్లు కు తెలియజేయాలని ధవలేశ్వరం సీ.ఐ టి గణేష్ తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

## తప్పులు వెంటనే తెలుస్తాయి: చంద్రబాబు

వల్ల చాలామందికి ప్రయోజనం చేకూరిందని సీఎం అన్నారు. ఆనాడు ఐటీ యుగం, ఇవాళ ఏఐ యుగం అని చంద్రబాబు వివరించారు. ఏపీకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

జనాభా ఉంటేనే ఏదైనా: దేశంలో ఇదివరకు పెద్ద కుటుంబాలు ఉండేవని, దాన్నే ఆస్తిగా భావించేవాళ్లని సీఎం అన్నారు. ఇప్పుడు కుటుంబాలు కుచించుకుపోయాయని గతంలో తానూ కుటుంబ నియంత్రణను ప్రోత్సహించానని ఆయన తెలిపారు. కానీ ఇప్పుడు కాలం మారిందని, పరిస్థితులు మారాయని జనాభా ఉంటేనే ఏదైనా ఉపయోగించుకునేందుకు వీలుంటుందని సీఎం వెల్లడించారు. శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్కొన్నారు. కాగా.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఫ్రూట్ కవర్ల వాడకం వల్ల పండ్లకు మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు ఆదేశించారు. కవర్ తొడిగిన పండ్ల నాణ్యతను, కవర్ లేని పండ్ల నాణ్యతను సీఎం స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మంచి రేట్లు రావడానికి వివిధ వెరైటీల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల స్థాయిలు పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# వరహాలుగెడ్డలో ఆక్రమణలపై చర్యలు తీసుకున్న అధికారులు



**పలాస, పతాకం న్యూస్:** పలాస మండలం కంబిరిగాం వద్ద వరహాలుగెడ్డలో ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులు లేని మట్టి తవ్వకాలను అడ్డుకొని ట్రాక్టర్లు, యంత్రాలను సీజ్ చేశారు. మధ్యాహ్నం వరహాలుగెడ్డ, సమీపంలో ఉన్న పంట భూముల్లో తవ్వకాలను తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, రెవెన్యూ అధికారులు, కాశీబుగ్గ పోలీసులు పరిశీలించారు. కొన్నేళ్ల కిందట అక్రమార్కులు ఈ ప్రాంతంలో 10 సెంట్లు ఆక్రమించి.. మట్టితో చదును చేశారు. రెండు రోజుల కింద మరో 6 సెంట్లు ఆక్రమించి.. మట్టిని నింపారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో జిరాయతీ భూమిని చదును చేసుకునేందుకు కొంతమంది రైతులు దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ వారికి అనుమతి ఇచ్చారు. నిబంధనల ప్రకారం పంట పొలంలో అడుగు లోతు వరకూ తవ్వుకోవాలి. అయితే సంబంధిత వ్యక్తులు మాత్రం ఐదు అడుగుల మేర తవ్వకాలు చేసి మట్టిని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సమీప 20 మీటర్ల దూరంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆయిల్ పైపులైన్ ఉంది. కాగా అనుమతికి మించి తవ్వకాలు కారణంగా ప్రమాదం పొంచి ఉండడంతో ఇచ్చిన అనుమతులు కూడా రద్దు చేసినట్లు ప్రకటించారు. పైపులైన్లకు ముప్పు వాటిల్లితే ఎవరు సమాధానం చెబుతారని రైతులను ప్రశ్నించారు. అనుమతి లేకుండా తవ్వకాలు చేస్తున్న ప్రొక్లయినర్, మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం... డోజర్‌కు అగ్నిప్రమాదం!

### సేఫ్టీ నిబంధనలు ఎక్కడ..? అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** ఆడివివరం నుండి లండగరువు దగ్గర వరకు జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల్లో ఘోర నిర్లక్ష్యం బహిర్గతమైంది. పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా ఒక డోజర్ యంత్రం నుంచి మంటలు ఎగసిపడటంతో అక్కడ భయానక పరిస్థితులు నెలకొన్నాయి. యంత్రంలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి డోజర్ మొత్తం అగ్నికి ఆహుతి అయ్యే పరిస్థితి ఏర్పడింది. అయితే అప్రమత్తంగా వ్యవహరించిన డ్రైవర్ సకాలంలో యంత్రం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకోవడం పెద్ద ప్రమాదం తప్పించినట్లైంది. క్షణాల్లో మంటలు పెరిగిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.స్థానికుల ఆరోపణల ప్రకారం రోడ్డు విస్తరణ పనులు పూర్తిగా సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కుతూ జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ యంత్రాలతో పనులు చేస్తున్నప్పటికీ ఎక్కడా ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడం, అగ్నిప్రమాదం జరిగితే ఎదుర్కొనే ఏర్పాట్లు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లకు పూర్తిగా వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించకుండా పనులు కొనసాగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగిన ఆ డోజర్‌లో భారీగా ఆయిల్, టైర్లు ఉండటం వల్ల మంటలు మరింత విస్తరించే ప్రమాదం ఏర్పడింది. అదే సమయంలో అక్కడ పెద్ద ఎత్తున వాహన రాకపోకలు, పాదాచారులు ఉండటంతో పరిస్థితి అదుపులో లేకపోతే భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.ఇలాంటి సంఘటనలు జరిగిన తర్వాత మాత్రమే అధికారులు కదిలే పరిస్థితి రావడం బాధాకరం. ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి పనులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు విస్తరణ పనుల్లో కఠినమైన సేఫ్టీ నిబంధనలు అమలు చేయాలని, ప్రతి యంత్రానికి ఫైర్ సేఫ్టీ పరికరాలు, అత్యవసర చర్యల ప్రణాళిక ఉండేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే చిన్న నిర్లక్ష్యం పెద్ద విషాదానికి దారితీయడం ఖాయం అని హెచ్చరిస్తున్నారు.ప్రజల ప్రాణాలు ముఖ్యమా... లేక కాంట్రాక్టర్ల లాభాలా...? అని స్థానికులు అధికారులను నిలదీస్తున్నారు.

## సెలబ్రేషన్స్ రెస్టారెంట్ బ్రాంచ్‌లపై ఆదాయపు పన్ను శాఖాధికారుల సోదాలు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలోని ప్రముఖ రెస్టారెంట్ చైన్ 'సెలబ్రేషన్స్'పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఉదయం పంజా విసిరారు. పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో నగరంలోని నాలుగు ప్రధాన కేంద్రాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించడం వ్యాపార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ప్రారంభమైన ఈ సోదాలు రాత్రి వరకూ కొనసాగుతున్నాయి. ఐటి శాఖకు చెందిన ప్రత్యేక బృందాలు సెలబ్రేషన్స్ రెస్టారెంట్‌కు చెందిన అక్కయ్యపాలెం, మధురవాడ, ఎన్ఎడి జంక్షన్, పెందుర్తి బ్రాంచిల్లో తనిఖీలు చేపట్టాయి. కేవలం భౌతిక రికార్డులే కాకుండా, రెస్టారెంట్ ఉపయోగిస్తున్న బిల్లింగ్ సాఫ్ట్‌వేర్, ఒక ప్రత్యేక యాప్ సర్వర్‌ను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. భారీ మొత్తంలో ఫుడ్ డెలివరీలు, సేల్స్ జరుగుతున్నప్పటికీ వాటికి సంబంధించిన డిజిటల్ డేటాను రికార్డుల నుంచి ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లు అధికారులు గుర్తించారు. కస్టమర్లు ఆన్‌లైన్ ద్వారా చేసిన చెల్లింపుల లెక్కలు చూపిస్తూ, నేరుగా నగదు రూపంలో ఇచ్చిన ఆదాయాన్ని లెక్కల్లో చూపకుండా పక్కదారి పట్టించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

## నిరుపయోగంగా డిజిటల్ కొలతల షెడ్డు



**చింతపల్లి, పతాకం న్యూస్:** ఆదివాసీ రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను కచ్చితమైన తూకానికి సంతల్లో విక్రయించేందుకు అనువుగా నిర్మించిన డిజిటల్ మెజర్(కొలత) షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వారపు సంతకు రైతుల వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో వర్తకులు తూనికల్లో మోసాలకు పాల్పడుతున్నారని గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు చేసిన డిజిటల్ తూనిక యంత్రాలతో కూడిన షెడ్లు వృథాగా పడి ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఐటీడీఏ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ వ్యాప్తంగా ప్రధాన సంతల్లో డిజిటల్ తూనిక యంత్రాలు, సంత షెడ్లు ఉన్నాయి. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పెదవలస, జీకేవీధి, ధారకొండ, చింతపల్లి, లంబసింగి సంతల వద్ద డిజిటల్ తూనిక యంత్రాలు, సంత షెడ్లు ఉన్నాయి. గిరిజన గ్రామాల నుంచి రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, సేకరించిన అటవీ ఉత్పత్తులను సంత షెడ్‌లో తూకం వేసుకుని డిజిటల్ స్లిప్ తీసుకొని, అదే కొలతలకు వర్తకులు కొనుగోలు చేసేలా నాటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి హరినారాయణన్ ఏర్పాట్లు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈ డిజిటల్ తూనిక యంత్రాలు తుప్పుపట్టి పోయాయి. షెడ్లు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పాత పద్ధతిలోనే సంతల్లో వర్తకుల వ్యక్తిగత తూనికలకే ఆదివాసీలు సరుకులు విక్రయించుకుంటున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి డిజిటల్ తూనిక యంత్రాలు, సంత షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంత ఆదివాసీలు కోరుతున్నారు.

## శరవేగంగా కేకే లైన్ డబ్లింగ్ పనులు



**అరకులోయ, పతాకం న్యూస్:** దక్షిణ మధ్య రైల్వేకు రూ.కోట్లలో ఆదాయాన్ని సమకూర్చే కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్ రెండో ట్రాక్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కిరండోల్ నుంచి సిమిలిగుడ వరకు డబుల్‌ట్రాక్ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం సిమిలిగుడ నుంచి కరకవలస స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి.బ్రిటిష్ కాలంలో ఐరన్‌ఓర్ జపాన్‌కు తరలించేందుకు వీలుగా వేసిన కొత్తవలస- కిరండోల్ రైల్వేలైన్ దక్షిణ మధ్య రైల్వేకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. కిరండోల్ నుంచి విశాఖపట్నం పోర్టు వరకు నిత్యం ఐరన్‌ఓర్ తరలిస్తుంటారు. ఇది ప్రధాన ఆదాయ వనరుగా మారడంతో రైల్వే శాఖ కేకే లైన్‌లో రెండో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా కిరండోల్ నుంచి సిమిలిగుడ వరకు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చింది. కేకే లైన్‌లో అత్యంత క్లిష్టమైన, కష్టతరమైన రైల్వే లైన్ కరకవలస నుంచి బొడ్డవర వరకు ట్రాక్ నిర్మాణం. గత ఏడాది ఈ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా సిమిలిగుడ-కరకవలస రైల్వేస్టేషన్ల మధ్య భారీ వంతెనలు, కొండచరియలు విరిగిపడకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు. కరకవలస స్టేషన్ నుంచి బొడ్డవర వరకు సుమారు 11కిలోమీటర్ల మేర 48 రైల్వే టన్నెల్స్ ఉన్నాయి. పాత ట్రాక్ పక్క నుంచే రెండో లైన్ పనులు ప్రారంబించారు. ఆధునిక సాంకేతికను వినియోగించి కరకవలస- బొర్రాగుహలు స్టేషన్ వరకు పనులు చేపడుతున్నారు. ఈ రెండు స్టేషన్ల మధ్య సుమారు ఏడు టన్నెల్స్ ఉన్నాయి. బొర్రాగుహలు-త్రైడా స్టేషన్‌ల మధ్య సుమారు 12 కిలోమీటర్ల మేర ఒకే టన్నెల్ నిర్మించనున్నట్టు తెలిసింది. బొర్రాగుహలు-బొడ్డవర, సిమిలిగుడ, త్రైడా, శివలింగపురం, బొడ్డవర స్టేషన్‌ల మధ్య పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. కొండలు, లోతైన ప్రాంతాల మధ్య ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టాల్సి రావడంతో ఇవి పూర్తయ్యేందుకు సుమారు రెండేళ్ల సమయం పట్టే అవకాశముందని భావిస్తున్నారు. డబుల్‌ట్రాక్ పనులు పూర్తిచేస్తే విశాఖపట్నం-అరకులోయ, కొరాపుట్-జైపూర్, జగదల్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లు వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. కిరండోల్ సమీపంలోని బైలదిల్లా గనుల నుంచి నిరంతరాయంగా ఐరన్‌ఓర్ తరలించేందుకు ఒక ట్రాక్‌ను పూర్తిగా వినియోగిస్తారని రైల్వేవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో రాయగడ రైల్వే డివిజన్‌కు ఊహించని ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు.

## జీడీ పంటకు మద్దతు ధర ప్రకటించాలని గిరిజనుల ఆందోళన



**వి.మాడుగుల, పతాకం న్యూస్:** జీడి పిక్కలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ .... సోమవారం అనకాపల్లి జిల్లా వి.మాడుగులలోని శంకరం పంచాయతీలో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ .... వి.మాడుగులలో జీడీ పంటకు మద్దతు ధర ప్రకటించాలని, జీడికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేజీ జీడీ పిక్కలకు రెండు వందల రూపాయలు ఇవ్వాలని, ఇతర దేశాల నుండి దిగుమతి అవుతున్న జీడి పిక్కలను తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. జీడి పిక్కలపై అసెంబ్లీలో చర్చించి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, తదితరులు ఈ నిరసనలో పాల్గొని మాట్లాడారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఒక కేసులో నిందితుడికి 41 నోటీసులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ బాబునాయక్, ఎస్ఐ ప్రమోద్ ఒక కేసు విషయంలో నిందితుడిని ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు, నోటీసులు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు లక్ష రూపాయలను లంచంగా డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్లాన్ వేశారు. ఫిర్యాదుదారు నుంచి ఆ లక్ష రూపాయల నగదును ఎస్ఐలు తీసుకుంటుండగా, మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి.

## మహిళలు తమ స్వశక్తితో రాణించాలి: భాగ్యలక్ష్మి





**మల్కాపురం, పతాకం న్యూస్ :** మహిళలు తమ నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకుని,స్వశక్తితో రాణించాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా మాట్లాడుతూ- డబ్బు. కీర్తి- ప్రతిష్టలు మనల్ని వరించాలంటే మనం గొప్ప వ్యక్తిత్వం గల మనుషులుగా ఉండాలని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ- ప్రతి మహిళ సృష్టిలో అద్భుతమైనదేనని, ఎవరి ప్రాధాన్యత వారికి ఉందని అన్నారు. ఆత్మవిశ్వాసంతో, తమలోని ప్రతిభను ప్రదర్శించాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. అనంతరం అనేకమంది అధ్యాపకులు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లాను, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మిని ,వృక్ష శాస్త్రంలో డాక్టరేట్ పొందిన డాక్టర్ సుధాను సెయింట్ ఆన్స్ యాజమాన్యం మరియు అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

## గ్యాస్ ధరల పెంపుపై రాస్తారోకో




**విజయనగరం, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంపును నిరసిస్తూ స్థానికులు సిపిఎం ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇస్తామన్నా ఉచిత గ్యాస్ సిలెండర్లు సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు కారణంగా అన్ని రకాల నిత్యవసర సరుకులు ధరలు పెరిగి మరింత భారంగా మారనున్నాయన్నారు.పెరిగిన గ్యాస్ ధరలు వలన ఆటో ఛార్జీలు, తినుబండారాలు ధరలు పెరిగి మరింత భారంగా మారనున్నాయన్నారు. అన్ని వర్గాలు ప్రజలు మీద పడుతున్న గ్యాస్ ధరలు భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

## అధికార పార్టీ వారికేనా యూరియా?



**వీరఘట్టం, పతాకం న్యూస్:** ఖరీఫ్ సీజన్లో అధికార పార్టీ నాయకులకే యూరియా పంపిణీ చేసి, రైతులకు ఇవ్వకుండా చేయడం ఎంత వరకు సమంజసమని పలువురు సభ్యులను అధికారులను నిలదీశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖకు సంబంధించి ఎఒ జె.సౌజన్య మాట్లాడుతున్న సమయంలో కంబర ఎంపిటిసి పొదిలాపు కృష్ణమూర్తినాయుడు మాట్లాడుతూ మండలంలో సంభవించిన పంటనష్టపరిహారం ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే నీలానగరం సర్పంచు వావిలపల్లి, పురుషోత్తమపురం గ్రామాలకు ఎరువులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనికి ఎఒ స్పందిస్తూ 8600 మంది రైతులు వరకు ఎరువులు పంపిణీ చేశామని, గ్రీవెన్స్ ద్వారా మరో 400 మందికి పంపిణీ చేసినట్లు వివరణ ఇచ్చారు. విఒఎల ద్వారా వేలిముద్రలు సేకరించి ఎరువులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఎవరికైతే ఎరువులు అందలేదో వారి ఇంటింటికి వెళ్లి స్లిప్పులిచ్చి ఎరువులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తహశీల్దారు ఎఎస్ కామేశ్వరరావు రెవెన్యూ శాఖకు సంబంధించి మాట్లాడుతూ 41 రెవెన్యూ గ్రామాల పరిధిలో 25 రెవెన్యూ గ్రామాల వరకు భూరీ సర్వే పూర్తి చేశామన్నారు. మూడు గ్రామాలకు సంబంధించి జెసి లాగిన్‌లో ఉన్నట్లు తెలిపారు. రెండు గ్రామాల్లో సర్వే పూర్తి దశకు వచ్చిందని తెలిపారు. ఇప్పటికే సే బియ్య వలస, పివిఆర్ పురం, కుమ్మరిగుంట, విక్రంపురం, కుమ్మరిగుంట గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి గురువారం రెవెన్యూ క్లినిక్లు ఏర్పాటు చేస్తున్నామని, సమస్య ఉన్నవారు రెవెన్యూ క్లినిక్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యు.వెంకంపేట సర్పంచి ఎస్.లక్ష్మి మాట్లాడుతూ తాము సాగు చేస్తున్న భూములకు అడంగల్, వన్ బి రావట్లేదని ప్రశ్నించగా వాటికి సంబంధించిన ఏమైనా పత్రాలుంటే పరిష్కారమయ్యేందుకు చర్యలు చేపడతామని తహశీల్దార్ వివరణ ఇచ్చారు. విద్యుత్‌శాఖ ఎఇ కె.సోమేశ్వరరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు త్రీ ఫేస్ ద్వారా రూ.6.80 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సేబియ్యం వలస, వండువ, బిటివాడ, పివిఆర్ పురం గ్రామాల్లో లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నీలానగరం సర్పంచి వావిలపల్లి పురుషోత్తం మాట్లాడుతూ గత సమావేశంలో కూడా తమ గ్రామంలో నాలుగు స్తంభాలు పాడయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి వేయాలని చెప్పగా, వాటిని కూడా పరిశీలించి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎఇ వివరణ ఇచ్చారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఎఇ డి.వెంకటరమణ మాట్లాడుతుండగా, ఎంపిపి వెంకటరమణనాయుడు, మరి కొంతమంది సభ్యులు సాగునీరు వృధా గురించి ప్రశ్నించారు. దీనికి ఎఇ స్పందిస్తూ మరమ్మతుల కోసం రూ.16 లక్షలతో ప్రతిపాదించామని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడుతామని వివరణ ఇచ్చారు. ఉపాధి, ఐసిడిఎస్, హౌసింగ్, తదితర శాఖల అధికారులు మాట్లాడారు. సమావేశలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి -ఉమామహేశ్వర రావు, వైస్‌ఎంపిపి పర్రి విజయ కుమారి, పలుశాఖల అధికారులు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

## 38 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**నిడదవోలు, పతాకం న్యూస్:** నిడదవోలు క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ.26.32 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి కందుల దుర్గేష్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కన్నీరు తుడిచే చేయి.. కష్టం తీర్చే గుండె.. కూటమి ప్రభుత్వానికి నిరంతర ఆయుధాలు" అని అన్నారు. 19 నెలల కాలంలో నిడదవోలు నియోజకవర్గంలో అక్షరాలా 673 మందికి రూ.5,12,20,251 లబ్ధి చేకూర్చామన్నారు. వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్న కుటుంబాలకు ఈ నిధులు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా కనకదుర్గమ్మ మహా కుంభాభిషేకం: మంత్రి ఆనం



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ అమ్మవారి మహా కుంభాభిషేక కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగిందని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంద్రకీలాద్రిపై పవిత్రమైన కార్యక్రమంలో తాను పాల్గొనటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన ఈ మహా కుంభాభిషేకం ముగిసిందని తెలిపారు. ఈ నెల 6,7 తేదీల్లో అన్ని పూజలు నిర్వహించారని వివరించారు. నేడు పవిత్ర జలాలతో విమాన గోపురానికి అభిషేకం చేశారని ప్రస్తావించారు. కంచి పీఠాధిపతులు శంకర్ విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందని తెలిపారు. సనాతన ధర్మ ప్రకారం అన్ని పూజాకార్యక్రమాలు జరిగాయని వెల్లడించారు. మంత్రాలయంలో ప్రత్యేకంగా రెండు గంటలపాటు మూల విరాట్‌కి పూజలు నిర్వహించారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నేడు కేవలం అమ్మవారి ముఖ దర్శనం మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. అమ్మవారి మహా కుంభాభిషేక కార్యక్రమానికి మొదటి రోజు నుంచి భక్తులు అధికంగా వస్తున్నారని తెలిపారు. పూజలు జరిగే సమయంలో అమ్మవారిని కొంతమంది సెల్ ఫోన్‌లో వీడియోలు తీశారని.. అది తప్పని.. మీ ఫోన్ నుంచి వేరే వారికి పంపించవద్దని.. ఈ ఫొటోలు ఉంటే వెంటనే డిలీట్ చేయాలని సూచించారు.

# వాడివేడిగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పార్లమెంట్ బడ్జెట్ మలి విడత సమావేశాలు సోమవారం నుంచి పున: ప్రారంభమయ్యాయి. పార్లమెంట్ సమావేశాలు.. అత్యంత వాడివేడిగా సాగే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై నేడు సభలో కీలక చర్చతో పాటు ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరగనుండగా.. దీనిపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. కాంగ్రెస్‌కు దీటైన జవాబు చెప్పి తీరుతామని.. ఒక వ్యక్తి మొండితనం కోసమే కాంగ్రెస్ అవిశ్వాసం తెస్తోందని.. స్పీకర్‌పై అవిశ్వాసం విషయంలో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదంటూ రిజుజు మండిపడ్డారు. కాగా.. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే.. రాజ్యసభలో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలపై చర్చించాలంటూ ఖర్గే డిమాండ్ చేశారు. అప్పుడే వంట గ్యాస్ ధరలు పెంచారని, ముందుగా యుద్ధ పరిస్థితులపై చర్చించాలని విపక్షం పట్టుపట్టింది. విపక్షం నిరసనల మధ్యే రాజ్యసభలో కేంద్రం ప్రకటన చేసింది. పశ్చిమాసియా పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని... భారతీయుల భద్రతకు కేంద్రం కట్టుబడి ఉందని జైశంకర్ చెప్పారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. మరోవైపు ... పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపి లు ఆందోళన చేపట్టారు. సస్పెండైన 8 మంది ఎంపి లు ఆందోళన చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ నినాదాలు చేశారు.

## లైసెన్స్ ప్రక్రియను ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు




**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ ఆధ్వర్యంలో కొన సాగుతున్న ఎల్ఎల్ఆర్, లైసెన్స్ ప్రక్రియను ప్రైవే టు సంస్థలకు అప్పగించే ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన విజయ నగ రం, అనకాపల్లి, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో ఎల్ఎ ల్ఆర్, లైసెన్సులు మంజూరు చేయడానికి మారుతీ సుజికీ వంటి సంస్థలతో కుదర్చుకున్న ఒప్పందానికి వ్యతిరేకంగా విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక రవాణా శాఖ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు, శ్రీధర్, ధర్మారావు తదిత రులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల రిలే దీక్ష



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద రిలే దీక్ష కొనసాగించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ, జిల్లా కమిటీ సభ్యుడు కె.రామారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన తుపాకు ల రవణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వకపోతే నిరవదిక సమ్మెకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. అలాగే జీతాలు పెంపు, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు, మట్టి ఖర్చులు, ఎక్స్‌గ్రేషియో పెంపు, సంక్షేమ పథకాల అమలు, మహిళా కార్మికుల సమస్యలపై ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు, పీరియడ్స్ సమయంలో వేతనంతో కూడిన సెలవు తదితర డిమాండ్లతో ఈ రిలే దీక్ష చేపట్టినట్టు తెలిపారు. సీఐ టీయూ జిల్లా కార్య దర్శి సీహెచ్ వెంకటేష్, హరిబా బు, యూనియన్ జిల్లా కోశాధికారి బి.హరిబాబు, నా యకులు రాము, దుర్గారావు, బాలరాజు పాల్గొన్నారు.

## ఆసుపత్రులకు నిధులు



**జియ్యమ్మవలస, పతాకం న్యూస్:** పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో రిపేర్లకు రూ. 38 లక్షలు, చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతు పనులకు రూ. 28 లక్షలు మంజూరైనట్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.భారతి తెలిపారు. చినమేరంగి ఆసుపత్రిలో జరుగుతున్న రిపేరు పనులను పరిశీలించారు. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టేండర్స్ (ఎన్‌క్వాస్) గ్యాప్‌లో భాగంగా నిధులు మంజూరైనట్లు ఆమె చెప్పారు. పార్వతీపురం ఆసుపత్రిలో మరమ్మతు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. చినమేరంగి సీహెచ్‌సీ వర్కులు ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని తెలిపారు. నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట డీఈఈ బి.ప్రసన్నకుమార్, ఆసుపత్రి వైద్యాధికారి చంద్రవర్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ.రాజారత్నంనాయుడు ఉన్నారు.

## ఏవోబీలో గంజాయి నిర్మూలనకు ఏపీ, ఒడిశా పోలీసుల సంయుక్త కార్యచరణ



**సాలూరు, పతాకం న్యూస్:** ఏవోబీలో గంజాయి నిర్మూలనకు ఇకపై ఏపీ, ఒడిశా పోలీసులు సంయుక్త కార్యచరణతో ముందుకు వెళ్లనున్నారు. ఇటీవల ఇరు రాష్ట్రాల పోలీస్ ఉన్న తాధికారులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. గంజాయి నియంత్రణ విషయంలో ఏపీ పోలీసులకు ఒడిశా పోలీసులు పూర్తిగా సహకరించనున్నారు. గతంలో మావోయిస్టుల కట్టడికి ఏపీ పోలీసులు సరిహద్దు దాటి ఒడిశాలోకి వెళ్లినట్టే.. ఇకపై గంజాయి సమాచారం తెలిస్తే గీత దాటనున్నారు. ఒడిశా పోలీసులు సైతం వచ్చి ఏపీలోకి వచ్చి చర్యలు తీసుకునే వెసులుబాటు కలిగింది. వాస్తవంగా ఏవోబీలోనే అత్యధికంగా గంజాయి సాగవుతుండగా.. 020 నుంచి నవంబరు 2025 వరకు దేశంలో 38.29 లక్షల కిలోల గంజాయి పట్టుబడగా.. అందులో 40 శాతం ఒడిశా, ఏపీలో స్వాధీనం చేసుకున్నట్లు ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వశాఖ పార్లమెంట్‌కు అందించిన నివేదిక ప్రకారం తెలుస్తోంది. మొత్తంగా గంజాయి విషయంలో ఒడిశా, ఏపీ రాష్ట్రాలు ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉన్నాయి. గతేడాది ఒడిశాలో గంజాయి కేసులు అధికంగా నమోదయ్యాయి. ఏపీలో మాత్రం సీసీ కెమెరాలు వినియోగించడం, డ్రోన్లతో పరిశీలన, చెక్‌పోస్టులు, ఈగల్ టీంలు ఏర్పాటుతో దాదాపు తగ్గుముఖం పట్టాయని కేంద్రహోంమంత్రిత్వశాఖ తన నివేదికలో వెల్లడించింది. ఒడిశాలో ఇప్పటికీ మల్కనగిరి, కోరాపుట్, రాయగడ తదితర జిల్లాలో శీలావతి, రాజహంస, తాళపత్ర రకాలు వంటి నాణ్యమైన గంజాయి సాగవుతున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. మారుమూల అడవుల్లో ఇది సాగవుతుండడంతో పాటు ఏపీ మీదుగా హరియాణ, పంజాబ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ఏపీలో గంజాయి సాగు నియంత్రించినా ఒడిశా నుంచి రవాణా తలనొప్పి వ్యవహారంగా మారింది. ఏవోబీలో ఒడిశా రాష్ట్రం పాడువా పరిధి జోలాపుట్ రిజర్వాయర్‌లోని ఓ ద్వీపంపై ఇటీవల ఒడిశా పోలీసులు దాడి చేసి రూ.200 కోట్ల విలువైన ద్రవ గంజాయి ( హ్యాషిష్ ఆయిల్), మరో రూ. 5 కోట్ల ముడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఒడిశాలో సాగు అధికంగా ఉండడంతో గంజాయి నిర్మూలనకు ఒడిశా పోలీసులు సైతం ఏపీ సహకారం కోరారు. దీంతో సమాచార మార్పిడి, ప్రస్తుత పరిస్థితులు, ఉమ్మడి ఆపరేషన్లకు సంయుక్త కార్యాచరణ చేయనున్నారు.

## కూటమి పాలనలో మహిళలకు చీకటి రోజులు




**అమరావతి, పతాకం న్యూస్:** కూటమి పాలనలో మహిళలకు చీకటి రోజులొచ్చాయని, వారి మాన, ప్రాణాలకు రక్షణ లేదని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. గంజాయి మత్తులో ఉన్మాదులు రెచ్చిపోతున్నారని, అయినా మహిళా మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణికి పట్టడం లేదని తెలిపారు. జగన్ పాలనలో మహిళలకు ఆర్థికంగా, రాజకీయంగా చేయూత ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ఎమ్మెల్యేల నుంచి రక్షణ ఉండటం లేదన్నారు. ఈ సందర్భంగా పారా బ్యాడ్మింటన్‌లో స్వర్ణ పతకాలు సాధించిన పడాల రూపాదేవిని సత్కరించారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లోనూ ఎదిగేందుకు వైసిపిలో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పురుషులతో సమానంగా పెద్దపెద్ద పదవులిచ్చి జగన్ ప్రోత్సహించారని పేర్కొన్నారు. 20 నెలల చంద్రబాబు పాలనలో ప్రతి మహిళా విసిగిపోయినట్లు తెలిపారు. ఎన్నికల ముందు 30 వేల మంది మహిళల ఆచూకీ లేదని చెప్పిన పవన్‌కల్యాణ్ అధికారంలోకి రాగానే ఆ ప్రస్తావన చేయడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, కృష్ణా జిల్లా జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎంపి చింతా అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం సమీపంలోని స్థానిక బొమ్మూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. సబ్‌స్టేషన్‌లో ఉంచిన పాత ప్లాస్టిక్ విద్యుత్ మీటర్లు మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లని పొగ వ్యాపించింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో విద్యుత్ సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనలో పెద్దగా ఆస్తి నష్టం జరగలేదు. పాడైపోయిన పాత ప్లాస్టిక్ విద్యుత్ మీటర్లు మాత్రమే దగ్ధమయ్యాయని ధవళేశ్వరం సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనుబాబు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు కూతుళ్లను చెరువులో తోసి చంపిన తండ్రి





**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలోని కామారెడ్డి పట్టణంలో ముగ్గురు పిల్లల అదృశ్యం కేసులో మిస్టరీ వీడింది. ఆర్థిక ఇబ్బందులు భరించలేక కన్న తండ్రే తన ముగ్గురు కుమార్తెలను చెరువులో తోసి చంపేశాడు. ఈ ఘటనలో షిఫత్ (8), అయత్ (7), మరియం (5) అనే ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. నిందితుడైన తండ్రి, ఆటో డ్రైవర్ ఇస్మాయిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏఎస్పీ చైతన్య రెడ్డి మీడియా సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఇస్మాయిల్ తన భార్యతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఉదయం 10 గంటల నుంచి తన ముగ్గురు కూతుళ్లు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సోషల్ మీడియాలో బాలికల ఫోటోలు షేర్ చేసి గాలింపు చేపట్టారు. విచారణలో భాగంగా, పిల్లలను అల్పాహారం కోసం హోటల్‌కు తీసుకెళ్లి తర్వాత వదిలేశానని ఇస్మాయిల్ చెప్పాడు. అయితే, ఎక్కడ వదిలేశాడనే విషయంపై పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. సీసీటీవీ ఫుటేజ్, నిందితుడి ఫోన్ కాల్ రికార్డులను పరిశీలించిన అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని గట్టిగా విచారించగా, తానే వారిని పెద్దచెరువులో తోసి చంపినట్లు అంగీకరించాడు.దాదాపు రూ. 5 లక్షలకు పైగా అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చలేక, పిల్లలను పోషించలేక ఈ దారుణానికి పాల్పడినట్లు ఇస్మాయిల్ పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. నిందితుడి భార్య షబీనా కూలి పనులకు వెళ్లిన సమయంలో ఈ ఘాతుకం జరిగింది. గజ ఈతగాళ్ల సహాయంతో పోలీసులు రాత్రి ఇద్దరి, ఆదివారం ఉదయం మరొకరి మృతదేహాన్ని వెలికితీశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేసులో లోతైన విచారణ కోసం నిందితుడిని పోలీస్ కస్టడీకి కోరతామని ఏఎస్పీ తెలిపారు.

# నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు- షెడ్యూల్ ఎప్పుడంటే?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందని సమాచారం. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని పూర్తి స్థాయి ఎన్నికల సంఘం బృందం బెంగాల్‌లో పర్యటిస్తోంది. ఆ బృందంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బిర్ సింగ్ సంధు, వివేక్ జోషి కూడా ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన తర్వాత ఈ బృందం మార్చి 10న దిల్లీకి తిరిగి వెళ్లనుంది. అక్కడ ఎన్నికల ఏర్పాట్లపై అన్ని రాష్ట్రాల్లో సమీక్ష పూర్తి చేసిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముందని ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహకాలను ఎన్నికల కమిషన్ పరిశీలించింది. ఇప్పుడు బంగాల్ సమీక్ష అనంతరం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఆ నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితులు కూడా ముగింపుకు చేరుకుంటున్నాయి. అసోం అసెంబ్లీ గడువు మే 20న ముగియనుంది. కేరళ అసెంబ్లీ కాలపరిమితి మే 23న ముగుస్తుంది. తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుండగా, బంగాల్ అసెంబ్లీ కాలపరిమితి మే 7న ముగియనుంది. అలాగే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో జరిగే ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఆ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించగలుగుతారు.

# రైతులను వెంటాడుతున్న 'సాగునీటి సమస్యలు'



**కాకినాడ, పతాకం న్యూస్:** సాగునీటి సమస్యలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరు అందాలంటే ఏటా అన్నదాతలకు సహవాసం తప్పడం లేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో సాగునీటి వ్యవస్థలు మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. దశాబ్దాలు తరబడి శిథిలావస్థకు చేరి ఉండడంతో సక్రమంగా సాగునీరు రైతులకు చేరడం లేదు.ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు పంటలను ముంచేత్తుతుండగా, మరోవైపు పూర్తిస్థాయిలో సాగునీరు అందరి పరిస్థితుల్లో నష్టాలు తప్పడం లేదు.జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సుమారు 53 వేల ఎకరాలలో ఆయకట్టు ఏలేరు సాగునీటి ఆధారంగా సాగవుతున్నాయి. ఏలేరు ఆధునికీకరణ చేపట్టకపోవడంతో ప్రతి సీజన్లోనూ ఈ పరిధిలో రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. ఫేజ్ -2లో దాదాపు రూ.400 కోట్ల నిధులతో గత ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేసినప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు జరుగుతాయని రైతాంగం ఆశించినప్పటికీ కదలిక లేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనేక హామీలను ఇచ్చినప్పటికీ ఆధునికీకరణ కోసం పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గం శివారు ఆయకట్టు కావడంతో ఇక్కడ రైతాంగం ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ నష్టాలకు గురవుతున్నారు. గొల్లప్రోలు టోల్గేట్ వద్ద పిడిందొడ్డి రెగ్యులేటర్ 1960లో నిర్మించారు. అప్పటినుంచి దీని పునర్నిర్మాణం జరగకపోవడంతో సాగునీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. ఏలేరు ఆధునికీకరణలో భాగంగా ఈ పనులు జరగాల్సి ఉంది. గతంలో వచ్చిన వరదలకు ఏలేరు కాలువలకు 201 చోట్ల గండ్లు పడ్డాయి. వాటిని పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. రూ.10 లక్షలపైన రూ.21 పనులు, రూ.10 లక్షల లోపు 180 పనులు నిర్వహణకు నిధులు మంజూరు అయినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పనులన్నింటినీ నీటి సంఘాల ప్రతినిధులకు ఇవ్వాలని కూటమి నాయకులు పట్టుబడుతున్నారు. రాజకీయ కారణాలతో ఇవి మరింత ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఏప్రిల్ మొదటి వారంలో పనులను పూర్తి చేసేందుకు ఖచ్చితంగా టెండర్లను పిలుస్తామని అధికారులు చెప్పుకొస్తున్నారు. సామర్లకోట శివారు ఏలేరు ప్రధాన కాలువపై రెగ్యులేటర్ మరమ్మతుల గురవడంతో షట్టర్ల స్థానంలో ఇసుక బస్తాలను ఉంచుతున్నారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి, తొండంగి మండలాల్లో కొన్ని కాలువలపై ఇసుక బస్తాలను అడ్డంగా ఉంచి నీటిని మళ్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.దశాబ్దాలుగా శిథిలావస్థలో...పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పిబిసి) కింద సుమారు 33 వేల ఎకరాల్లో పంటలు సాగుతున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో ఈ ఆయకట్టు ఉంది. ఖరీఫ్‌లో గోదావరి జలాలు, రబీలో ఏలేరు నీరు ఆధారంగా సాగు జరుగుతుంది. ప్రధానంగా యు.కొత్తపల్లి మండలంలో ఉన్న నాగులపల్లి రెగ్యులేటర్ 1950లో అప్పటి పిఠాపురం రాజా పునర్నిర్మాణం చేపట్టారు. అప్పటినుంచి మళ్లీ ఆధునికీకరణ పనులు జరగలేదు. ఈ రెగ్యులేటర్ కింద దాదాపు 2 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. రూ.3 కోట్లతో పనుల ప్రతిపాదనలు ఇరిగేషన్ అధికారులు అనేకసార్లు ప్రభుత్వానికి పంపారు. అయినా గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిధులను కేటాయించడం లేదు. పిఠాపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. గొల్లప్రోలు నక్కలగండి కాలువపై ఉన్న బల్లకట్టు గేటు, సర్ ప్లస్ గత 30 నుంచి 40 ఏళ్లుగా శిథిలావస్థకు చేరి ఉన్నాయి. దీనిపై దాదాపు 7 ఎకరాలు ఆయకట్టు సాగవుతుంది. ఐదేళ్ల క్రితం చెక్ డ్యామ్ కాంక్రీట్ గోడకు గండిపడింది. అయినా ప్రభుత్వం దీని మరమ్మతులకు నిధులను కేటాయించడం లేదు. సుమారు రూ.2.50 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. మల్లవరం ఆర్ఆర్ బి ట్యాంకు 1300 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువుపై సుమారు 8 వేల ఎకరాలు ఆయకట్టు సాగవుతుంది. 14 తూముల ద్వారా పొలాలకు సాగునీరు అందుతుంది. గత 30 ఏళ్లుగా రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరి ఉండడంతో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, తొండంగి మండలాలకు తాగునీరు సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయి. దీని ఆధునికీకరణ కోసం రూ.రెండు కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

అలాగే చెరువులో మట్టిని తరలించి సాగు, తాగునీటికి ఆటంకాలు లేకుండా, కెపాసిటీ పెంచేందుకు పనులు చేయాలంటే మరో రూ.3 కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇదే చెరువుపై తొండంగి మండలంలో 200 ఎకరాలు విస్తీర్ణంలో ఉప్పు చెరువుకి సాగునీరు వెళుతుంది. దీని కింద మరో 2 వేల ఎకరాలు ఆయికట్టు ఉంది. దీని కెపాసిటీని పెంచేందుకు మరో రూ.1 కోటి నిధులు ఖర్చవుతుంది.ఇలా పలుచోట్ల సాగునీటి వ్యవస్థలు తీవ్రస్థాయిలో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గం పరిధిలోనే 23 కలింగలు, రెగ్యులేటర్లు శిథిలావస్థకు చేరడంతో సాగునీటి సరఫరా సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులు తాత్కాలికంగా ఇసుక బస్తాలు, తాటి దుంగలు, చెక్కలు అడ్డుపెట్టి నీటిని పొలాలకు మళ్ళిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల క్రితం కాలువల్లో కొంత మేర పూడికను తొలగించి అరకొర పనులను సాగించి చేతులు దులుపుకొందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ఈ వేసవిలోనైనా పనులు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రైతులు కోరుతున్నారు.

# పొదుపు మహిళలకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మి

**అమరావతి, పతాకం న్యూస్:** పొదుపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించనుంది. సంఘసభ్యుల్లోని పిల్లల చదువు, వివాహాల కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పేరిటా రెండు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టనుంది. అర్హులందరికీ ఈ పథకాలను అందించేందుకు ఇప్పటికే సెర్ప్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గత ఏడాది అక్టోబరులోనే ఈ రెండు పథకాలను అమలుచేయాలని నిర్ణయించినా, అమల్లో లోపాలకు ఆస్కారం లేకుండా అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో జాప్యం జరిగింది. పాఠశాలలు కళాశాలల్లో పిల్లల ఫీజుకు అవసరమయ్యే మొత్తాన్ని రుణంగా తీసుకునే వీలుంటుంది. ఇద్దరి పిల్లల చదువుకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణ సా యం అందుతుంది. దీనికి కేవలం పావలా వడ్డీ మాత్రమే వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. అడ్మిషన్ లెటరు, ఫీజు చెల్లింపు విధానం, ఇనిస్టిట్యూట్ వివరాలు, రశీదులు సమర్పించాలి. రుణం మంజూరైన వెంటనే నేరుగా బ్యాంకు ఖాతాలో డబ్బు జమవుతుంది.మహిళా సంఘంలోని సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది. అవసరానికి అనుగుణంగా రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణంగా తీసుకునే వెసులుబాటు ఉంది. పావలా వడ్డీకే రుణం అందిస్తారు. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. వివాహ లగ్న పత్రిక, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా పత్రం సమర్పించాలి. పరిశీలన అనంతరం, నేరుగా సభ్యురాలి బ్యాంకుఖాతాకు నగదు జమ చేస్తారు. విద్యాలక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా నిధులు కేటాయిస్తుంది. ఈ పథకాల అమ ల్లో భాగంగా పావలా వడ్డీ కింద సమకూరే ఆదాయంలో 50 శాతం తిరిగి డ్వాక్రా సంఘాలకు అనుగుణంగా



ఉన్న మండల గ్రామ సమాఖ్యల బలోపేతానికి వినియోగిస్తారు. మిగిలిన 50 శాతం స్త్రీనిధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలకు వినియోగిస్తారు. ఈ పథకం కింద రుణసాయం పొందిన తర్వాత లబ్ధిదారులు ఏదైనా ప్రమాదంలో మృతిచెందితే రుణం మొత్తం మాఫీ చేస్తారు. డ్వాక్రా సంఘంలో నమోదై, కనీసం నాలుగునెలలు అంతకంటే ఎక్కువకాలం కొనసాగుతున్న సభ్యులకు పథకాలు వర్తింపచేస్తారు. ఇప్పటికే బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలు పొందిన వారికి కూడా ఈ పథకాలు అందుతాయి. కొత్త పథకాలు పిల్లల చదువులు, వివాహాలకు అక్కరకు వస్తాయని పొదువు మహిళలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

# వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన కవిత

**ఖమ్మం, పతాకం న్యూస్:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖమ్మం నగరం జెడ్పీ కూడలిలో ఆందోళనకు చేపట్టారు. ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు బాధితులకు మద్దతుగా లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందడం లేదని విమర్శించారు. అనంతరం కార్యకర్తలు, బాధితులతో కలిసి జెడ్పీ కూడలిలో ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీనితో రోడ్డుపై ఇరువైపులా



వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని, సర్ది చెప్పడంతో కవిత నిరసన విరమించారు.

## రిజర్వాయర్ గుంతలో దిగి విద్యార్థి మృతి



**మంగళగిరి, పతాకం న్యూస్:** రిజర్వాయర్ కోసం తవ్విన భారీ నీటి గుంతలో ఈతకని దిగి విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. దీనిపై మృతుని కుటుంబం, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళనకు దిగాయి. మండలంలోని కృష్ణాయపాలేనికి చెందిన కంతేటి విమల, ప్రకాష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా కుమారుడైన ప్రజ్వల్ సంతోష్ (15) ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ప్రజ్వల్ సంతోష్, మరో ఇద్దరు స్నేహితులు కలిసి మధ్యాహ్నం ప్రత్యేక తరగతులకు వెళ్లి వస్తున్నారు. కొండవీటి వాగు పనుల్లో భాగంగా గ్రామంలో జరుగుతున్న రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రైవేట్ సంస్థ తవ్విన గుంతలో నీటి వద్దకు ముగ్గురు విద్యార్థులూ వెళ్లి ఈతకు దిగారు. ప్రజ్వల్ సంతోష్ నీటిలో మునిగిపోతుండగా గమనించిన మిగతా ఇద్దరు భయపడి ఒడ్డుకు చేరారు. అనంతరం స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారంతా వచ్చి దాదాపు రెండు మూడు గంటలు గాలించగా ప్రజ్వల్ సంతోష్ మృతదేహం కనిపించింది. విద్యార్థి మృతిపై రాజకీయ పార్టీలు, సంఘాలతో కలిసి తల్లిదండ్రులు, బంధువులు గ్రామంలో రాస్తారోకోకు దిగారు. భారీ గుంతలు తీసిన కాంట్రాక్ట్ సంస్థ రక్షణ చర్యలేమీ చేపట్టలేదని, అదే ప్రమాదానికి దారితీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. మృతుని కుటుంబీకులు, బంధువులతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడి పరిహారానికి అంగీకరించడంతో రాస్తారోకో ముగిసింది. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కె.సత్యం, శ్యాంబాబు, వైసిపి నాయకులు ఇ.రమేష్, టిడిపి నాయకులు రవికిరణ్, శేషు పాల్గొన్నారు.

## పశ్చిమాసియా పరిణామాలు ఆందోళనకరం

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో జరుగుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్‌లు రాజ్యసభలో పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ప్రాంతీయ ఉద్రిక్తతలపై మాట్లాడుతూ .... సమస్యలకు చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కారం కనుక్కోవాలని భారత్ విశ్వసిస్తోందని చెప్పారు. ప్రధాని మోడీ ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని ఆయన అన్నారు. సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి ప్రాంతంలోని పరిస్థితులను అంచనా వేస్తున్నామన్నారు.

## ఐక్య ఉద్యమాలతోనే హక్కుల సాధన




**గుంటూరు, పతాకం న్యూస్:** హక్కుల సాధనకు, వాటి పరిరక్షణ అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తినిస్తుందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.రమాదేవి అన్నారు. లక్షలాది మంది శ్రామిక మహిళలు ఐక్యంగా హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా, యుటిఎఫ్, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్ నుండి బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయం వరకు మహిళలు, ఉద్యోగినులు, కార్మికులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళలపై హింసను అరికట్టాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో కాజా గ్రామానికి చెందిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. చిన్నారులు, మహిళలు అభ్యుదయ గీతాలకు నత్యాలు ప్రదర్శించారు. అనంతరం యుటిఎఫ్ హాల్లో ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.పద్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక స్థితిగతులు, ఉపాధి అవకాశాలను ఏ మాత్రమూ పట్టించుకోకుండా ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కనాలని సిఎం చంద్రబాబు పిలుపునివ్వటం సరికాదన్నారు. కేవలం రూ.25వేల ప్రోత్సాహంతో పిల్లల పెంపకం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని అన్నారు. పెట్టుబడిదారులకు కారుచౌకగా కార్మికవర్గాన్ని అందించటానికే అధిక జనాభాను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా మహిళలపై తీవ్రమైన దాడి జరుగుతోందని, మహిళల గౌరవాన్ని కించపరిచేలా సోషల్ మీడియా వేదికగా జోకులు, స్కిట్‌లు ఉండటం బాధాకరమని అన్నారు. ఇంటి పనులు, పిల్లల పెంపకం, స్త్రీ, పురుషుల ఇద్దరి బాధ్యతగా భావించాలన్నారు. మహిళలు వంటింటి నుండి బయటకు వస్తేనే విముక్తి అని రాజారామోహ్మన్‌రారు చెప్పిన మాటలను సోషలిస్టు రష్యాలో లెనిన్ ఆచరణలో చేసి చూపించాడని గుర్తు చేశారు. రాష్ట్రంలో శ్రామిక మహిళలు దాదాపు 56 లక్షల మంది ఉన్నారని, వారంతా ఐక్యంగా ఉండాలని పిలుపునచ్చారు. జెవివి సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పాల్గొన్నారని, వేలాది మంది ప్రాణాలు అర్పించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో జరిగిన సంస్కరణ ఉద్యమాలు మహిళల అభివృద్ధికి బాటలు వేశాయన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో కలకలం.. ఒకేరోజు 10 వేల కోళ్ల మృతి!



**నాగర్‌కర్నూల్, పతాకం న్యూస్:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని పౌల్ట్రీ రైతులు అంతుచిక్కని వైరస్ దెబ్బకు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లావ్యాప్తంగా ఒకే రోజులో సుమారు 10 వేల కోళు మృత్యువాత పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామంతో పెట్టుబడులు పెట్టిన చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం చిన్నపురావుపల్లిలో ఉన్న ఓ ఫారంలో ఏకంగా 5 వేల కోళ్లు చనిపోయాయి. అలాగే నాగర్‌కర్నూల్ మండలంలోని రాంరెడ్డిపల్లి తండాలో 1,500 కోళు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మరో 4 వేల వరకు కోళ్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామంతో ఏం చేయాలో తెలియక రైతులు లబోదిబోమంటున్నారు. కోళ్ల మృతికి కారణమైన వైరస్‌ను గుర్తించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఫోరెన్సిక్ నిపుణుల బృందం నాగర్‌కర్నూల్‌కు రానుంది. వారు మృతి చెందిన కోళ్ల నమూనాలను సేకరించి, వైరస్ రకాన్ని నిర్ధారించేందుకు పూర్తిస్థాయిలో పరిశోధనలు జరపనున్నారు. నిపుణుల నివేదిక వచ్చిన తర్వాతే కోళ్ల మరణాలకు గల కచ్చితమైన కారణం తెలియనుంది.

## విద్యుత్ షాక్‌తో రెండు ఏనుగులు మృతి

**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతి జిల్లా యర్రావారి పాళెం మండలంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో రెండు ఏను గు మతి చెందాయి. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివ రాల ప్రకారం.. నైరబైలులోని ఫారెస్ట్ బంగ్లా సమీపంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు. అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి ఏనుగులు మృతి చెందాయన్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# ‘కళ్లు తిరగడం, తలనొప్పి’గా ఉంటోందా?

శరీరానికి తగినంత నీరు అవసరమని డాక్టర్లు పదేపదే చెబుతుంటారు. రోజుకు కనీసం 1.5 నుంచి 2 లీటర్ల నీళ్ల తాగాలంటున్నారు. కానీ, ఈ ఉరుగులు, పరుగుల జీవితంలో చాలామంది ఈ విషయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. దీంతో డీహైడ్రేషన్?కు గురవ్వడం, శరీర అవయవాల పనితీరు మందగించడం తదితర సమస్యలతో ఇబ్బందలుపడుతున్నారు. అయితే డీహైడ్రేషన్?కు గురైనప్పుడు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!



చాలా మంది రాత్రిళ్లు బాగా నిద్రపోయినప్పటికీ.. ఉదయం అలసటగా ఫీల్ అవుతుంటారు. అందుకు శరీరంలో నీటి శాతం తక్కువగా ఉండడమే కారణం అంటున్నారు నిపుణులు. నీరు తగ్గినప్పుడు రక్త పరిమాణం తగ్గుతుందని చెబుతున్నారు. దీనివల్ల ఆక్సిజన్, పోషకాలను సరఫరా చేయడానికి గుండె మరింత కష్టపడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

శరీరంలో నీటి శాతం తగ్గిపోయినప్పుడు, మెదడు కణజాలం తాత్కాలికంగా కుంచిం చుకుపోవచ్చంటున్నారు నిపుణులు. దీనివల్ల ఏర్పడే ఒత్తిడి మార్పులు తలనొప్పికి దారితీస్తుందని పేర్కొంటున్నారు. అయితే, నీరు సరిగా తాగడం వల్ల ఇలాంటి తలనొప్పులు తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరం డీహైడ్రేషన్?కు గురైనప్పుడు తలనొప్పి, అలసట, ఆకలి లేకపోవడం లేదా చక్కెర తినాలనే కోరిక, కండరాల తిమ్మిరి, మలబద్ధకం లాంటి లక్షణాలు కనిపిస్తాయని అధ్యయనం పేర్కొంది.

చర్మం మన శరీరంలో అతిపెద్ద అవయవం. డీహైడ్రేషన్?గా ఉన్నప్పుడు చర్మం కాంతివిహీనంగా లేదా తక్కువ సాగే గుణంతో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై చిన్న చిన్న గీతలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొంటున్నారు.

మూత్రం రంగు మన ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తుంది. లేత గడ్డి రంగులో ఉంటే హైడ్రేషన్‌గా ఉన్నట్లు, ముదురు పసుపు రంగులో ఉంటే శరీరానికి మరిన్ని ద్రవాలు అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. జీర్ణక్రియ సాఫీగా సాగడానికి నీరు చాలా ముఖ్యం. శరీరంలో తగినంత నీరు లేనప్పుడు, వ్యర్థాల నుంచి పేగులు నీటిని పీల్చుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మలం గట్టిపడి మలబద్ధకం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

తీపి కోరికలు ఎప్పుడూ ఆకలి వల్లనే కలగవు. కాలేయం శక్తి కోసం గ్లూకోజ్‌ను విడుదల చేయాలంటే నీరు అవసరం. హైడ్రేషన్ తగ్గినప్పుడు ఈ ప్రక్రియ మంద గిస్తుందంటున్నారు నిపుణులు. దీంతో మెదడు చక్కెర అవసరమని తప్పుగా అర్థం చేసు కుంటుందని చెబుతున్నారు.

సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత నీటిపై ఆధారపడి ఉంటుంది. నీరు లేకపోతే కండరాలు సులభంగా తిమ్మిర్లకు గురవుతాయంటున్నారు నిపుణులు. అలాగే, త్వరగా లేచి నిలబడినప్పుడు కళ్లు తిరిగినట్లు అనిపించవచ్చని వివరిస్తున్నారు. శరీరానికి ఎంత నీరు అవసరమనేది.. వయస్సు, వాతావరణం, శ్రమను బట్టి మారుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా పెద్దలు రోజుకు 2 నుంచి 3 లీటర్ల ద్రవాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్థిరమైన శక్తి, లేత రంగు మూత్రం, క్రమబద్ధమైన మూత్ర విసర్జన వంటివి మీరు తగినంత హైడ్రేటెడ్‌గా ఉన్నారని చెప్పే స్పష్టమైన సంకేతాలని తెలియ జేస్తున్నారు. మామూలుగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని అధ్యయనం పేర్కొంది.

# అలైన్‌మెంట్ల మార్పుతో రైతుల్లో ఆందోళన

## నష్టపరిహారంపై స్పష్టత కరువు



**విజయనగరం, పతాకం న్యూస్:** ఇటీవల జిల్లాలో 16చోట్ల రైల్వేగేట్ల వద్ద ఆర్‌ఒబిలు నిర్మించేందుకు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఎన్నోఏళ్లగా ఎదురు చూస్తున్న పురిటిపెంట రైల్వేగేటు సమస్య తీరుతుందని ఈ ప్రాంత ప్రజలంతా ఆనందం వ్యక్తం చేశారు. దీంతో పురిటిపెంట రైల్వేగేటు వల్ల తీవ్ర ఇబ్బందులు పడతున్న సుమారు 30 గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అధికారులు తరచూ మారుస్తున్న అలైన్‌మెంట్ మార్పుతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. గజపతినగరం మండలం పురిటిపెంట రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై అటు ప్రజలు, ఇటు రైతుల్లో గందరగోళం నెలకొంది. పాలకులు, అధికారులు రోజుకొకలా మారుస్తున్న అలైన్‌మెంట్లతో ఆందోళన చెందు తున్నారు. ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ రూ.47కోట్లు కేటాయించింది. తొలుత గజపతినగరం నాలుగు రోడ్లజంక్షన్ దాటిన తరువాత మెంటాడ రోడ్డు నుంచి రైల్వేగేటు మీదుగా ప్రస్తుతమున్న రహదారి స్థానంలోనే ఆర్‌ఒబి చేపట్టాలని అధికారులు భావించారు. మరోవైపు ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి పురిటిపెంట పొలాలు మీదుగా ఆ గ్రామ ఆంజనేయ విగ్రహం వద్ద కనెక్టివిటి ఇచ్చేందుకు, చంపావతి నదిని ఆనుకొని పురిటిపెంట మామిడి బంద కాలనీ వెనుక భాగం నుంచి రైల్వే పట్టాలు మీదుగా ఆర్‌ఒబి నిర్మాణానికి అవకాశాలను కూడా అధికారులు పరిశీలించారు. మ్యాప్‌ల మార్పుతో... గందరగోళం! గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుకభాగం నుంచి రైల్వే పట్టాల మీదుగా ఆర్‌ఒబి నిర్మిస్తూ పురిటిపెంట ఆంజనేయ స్వామి గుడి వద్ద నూతన రోడ్డు కనెక్టివిటీ ఇచ్చేందుకు చివరిగా నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈమేరకు బొబ్బిలి ఆర్‌డిఒ మోహన్‌రావు గుట్టు చప్పుడు కాకుండా పురిటిపెంట పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీ తీర్మానం ఇవ్వాలని కోరడంతో అప్పటికప్పుడు పంచాయతీ పాలకవర్గం తీర్మానం ఇచ్చేసింది. అయితే గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా రైల్వేగేటు పక్క ఆర్‌యుబి నిర్మించాలని కోరడంతో అందుకు ఆర్‌డిఒ, రైల్వేశాఖ ఇంజినీర్లు 8 అడుగుల వెడల్పుతో ఆర్‌యుబి (అండర్ రైల్వే బ్రిడ్జి) నిర్మాణానికి సమ్మతి తెలిపినట్లు తెలిసింది. అయితే గ్రామసభ పెట్టకుండా, రైతుల భూముల సేకరణకు సంబంధించి ఎంత పరిహారం ఇస్తారో తెలియ జేయకుండానే పంచాయతీ తీర్మానం తీసుకోవడం పట్ల రైతులు ఆందోళన చెందారు. ఇంతలోనే ఉన్నట్టుండి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచన మేరకు ఇప్పుడు ఆ ప్లాన్ మార్చివేసి, పురిటిపెంట-గంగచోళ్లపెంట మధ్యలో ఉన్న దుర్గాదేవి గుడి సమీపాన కర్రల డిపో వద్దకు అలైన్‌మెంట్ మళ్లించడంతో పురిటిపెంట గ్రామస్తులు విస్మయానికి గురవుతున్నారు. రైల్వేశాఖ కేటాయించిన రూ.47కోట్లు చాలకపోయినా ఆర్‌ఒబి పరిధి పెంచడం వెనుక ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల్లో ఆందోళన పురిటిపెంటలో వందల ఏళ్లుగా పూర్వీకుల నుంచి సాగు చేస్తున్న భూములు సుమారు 265 ఎకరాలు ఉన్నాయి. ఇవి హెల్డ్ ఓవర్ (హక్కు నిర్ధారించిన భూములు)గా ఉన్నాయని, వీటిలో సాగు చేస్తూ జీవనం సాగించడమే తప్ప మరో ఇతర ఆదాయం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ భూములను ఆర్‌ఒబి కోసం తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై గతంలో పలుమార్లు స్థానిక నాయకులతో పాటు, సంబంధిత రైతులు రెవెన్యూ అధికారుల వద్ద, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వద్ద తమ గోడును విన్నవించుకున్నారు. తమకు పట్టాలివ్వాలని కొన్ని రోజుల కిందట రైతులంతా తమ సర్వే నెంబర్లతో సహా తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి కొండపల్లి ద్వారా వినతి పత్రం పంపించారు.భూముల వాస్తవ ధర కోట్లలో .. పరిహారం ఇచ్చేది ఎంతో? ప్రస్తుతం పురిటిపెంట రెవెన్యూ పరిధిలో భూముల రేట్లు ఎకరా కోట్లలోనే ఉంది. ప్రభుత్వం మాత్రం హెచ్ఒడి భూములు కనుక ఎంతోకొంత రైతులకు ముట్టజెప్పి చేతులు దులుపుకుందామని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తమకు ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ ఆర్‌ఒబికి ఏయే సర్వే నెంబర్లలో ఎన్ని ఎకరాలు రైతుల నుంచి తీసుకుంటారు? వాటికి ఎంత పరిహారం ఇస్తారనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. అండర్‌పాస్ కావాలిఇప్పటికే ఆర్‌ఒబి నిర్మాణానికి సుమారు రూ.47కోట్లు నిధులు విడుదలైనా పనులు ప్రారంభించకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న రైల్వే గేటును పూర్తిగా మూసివేయకూడదని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అటువైపు ఉన్న పొలాలకు వెళ్లాలన్నా, అత్యవసర సమయాల్లో టూ వీలర్లు వెళ్లాలన్నా కనీసం అండర్ లైన్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

# ప్రజలపై ధరల భారం



**అమరావతి, పతాకం న్యూస్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ప్రభావంతో పెరుగుతున్న ధరలు సామాన్యులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మన దేశానికి ఇరాన్ సమీపంలోని హార్మూజ్ జలసంధి మీదుగానే చమురు దిగుమతులు జరుగుతున్న విషయం విదితమే. ఈ మార్గంలోనే ఓడలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో చమురు సంస్థలను దిగుమతి సంక్షోభం వెంటాడుతోంది. ఫలితంగా ఇప్పటికే కమర్షియల్ సిలిండర్స్ బల్క్ బుకింగ్‌లు నిలిచిపోయాయి. మరో వైపు వంట గ్యాస్ ధరలూ అమాంతంగా పెరిగాయి. గృహ వినియోగ సిలిండర్ గ్యాస్ ధర రూ.875 నుంచి రూ.395కు చేరింది. ఈ లెక్కన సిలిండర్‌కు రూ.50 చొప్పున పెరిగింది. కమర్షియల్ సిలిండర్ ధర రూ.1941 నుంచి రూ.2055కు చేరింది. దీంతో ఒక్కొక్క సిలిండర్‌పై రూ.114 చొప్పున భారం పడింది. జిల్లాలో ఐఒసి, బిపిసి, హెచ్‌పిసిఎల్ వంటి సంస్థలకు జిల్లాలో 50కి పైగా ఏజెన్సీలు ఉన్నాయి. జిల్లాలో 16.77 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో గృహావసరాలకు 15.10 లక్షల మంది ఉన్నారు. నెలకు సరాసరి 7.50 లక్షల సిలిండర్‌ల గ్యాస్ వినియోగం ఉంటుంది. ఈ లెక్కన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.60 చొప్పున అక్షరాలా రూ.4.50 కోట్ల భారం పడుతోంది. కమర్షియల్ సిలిండర్‌లు నెలకు లక్షకుపై వినియోగిస్తుంటారని అంచనా. కాగా ఈ లెక్కన కమర్షియల్ సిలిండర్‌కు రూ.114 చొప్పున నెలకు అక్షరాలా రూ.1.14 కోట్ల భారం పడింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. జిల్లాలో 106 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ108.83 డీజిల్ ధర రూ.96.71గా ఉంది. రోజుకు సగటున లక్ష లీటర్ల పెట్రోల్, అదే స్థాయిలో డీజిల్ వినియోగం ఉటుందని ప్రాథమిక అంచనా. వంట నూనెల ధరలనూ యుద్ధ ప్రభావం వెంటాడుతోంది. జిల్లాలో సన్‌ఫ్లవర్, పామాయిల్, వేరుశనగ నూనెను జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగిస్తుంటారు. అన్ని రకాల వంట నూనెలూ కలిపి 1200 టన్నులు విక్రయిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి నెలా రూ.13 కోట్ల వ్యాపారం జరుగుతోంది. సన్‌ఫ్లవర్ నూనె రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా వంటి దేశాల నుంచి దిగుమతి అవుతోంది. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంతో దిగుమతులు ఆగితే వంటనూనెల ధరలు భారీగా పెరిగే అవకాశం లేకపోలేదు. యుద్ధం ప్రభావంతో దిగుమతులు మందగించే అవకాశం ఉంది.




## న్యూజిలాండ్‌పై గెలుపుతో టీ20

# ప్రపంచకప్ టీమిండియా కైవసం



ఐసిసి 2026 టి-20 ప్రపంచకప్ టీమ్ ఇండియా సొంతమైంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ 96 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 256 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ కనీస పోటీ ఇవ్వలేదు. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (52, 26 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43, 35 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు అందరూ విఫలమయ్యారు. భారత పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా (4/15), అక్షర్ పటేల్ (3/27) ఛేదన ఆరంభంలోనే న్యూజిలాండ్ నడ్డి విరిచారు. పవర్‌ప్లేలోనే భారత్ విజయాన్ని ఖరారు చేశారు. 19 ఓవర్లలో 159 పరుగులకు న్యూజిలాండ్ కుప్పకూలింది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ టాప్-3 బ్యాటర్లు విశ్వరూపం చూపించగా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోరు చేసింది. సంజు శాంసన్ (89, 46 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (54, 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (52, 21 బంతుల్లో 6 ఫోరుల, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. శివం దూబె (26 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆఖర్లో అదరగొట్టాడు. కివీస్ పేసర్ జేమ్స్ నీషమ్ (3/46) రాణించాడు. టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. ఆచితూచి ఆడిన సంజు శాంసన్ (89) సిక్సర్‌తో పరుగుల వేట షురూ చేశాడు. వరుస వైఫల్యాలతో ఒత్తిడిలో పడిన అభిషేక్ శర్మ (52) సైతం నెమ్మదిగానే ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. దీంతో తొలి రెండు ఓవర్లలో 12 పరుగులే వచ్చాయి. మూడో ఓవర్లో మొదలైన తుపాన్.. పవర్‌ప్లేలోనే కివీస్ బౌలర్లను ముంచెత్తింది. అభిషేక్ శర్మ, సంజు శాంసన్ శివమెత్తగా.. వరుస ఓవర్లలో 24, 21, 20 పరుగులు పిండుకున్నారు. దీంతో పవర్‌ప్లేలోనే భారత్ 92/0తో నిలిచింది. ఆఫ్ స్పిన్ బలహీనత అధిగమిస్తూ పేసర్లపై పంజా విసిరిన అభిషేక్ శర్మ 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 18 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. సంజు శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 43 బంతుల్లోనే 98 పరుగులు జోడించారు. భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. అభిషేక్ శర్మ నిష్క్రమించినా.. భారత్ దూకుడు తగ్గలేదు. సంజు శాంసన్‌కు తోడైన ఇషాన్ కిషన్ (54) రెండో వికెట్‌కు 48 బంతుల్లోనే 105 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 23 బంతుల్లోనే ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ సాధించగా.. సంజు శాంసన్ 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 33 బంతుల్లో ఫిఫ్టీ అందుకున్నాడు. టాప్-3 బ్యాటర్ల ధనాధన్‌తో భారత్ 15 ఓవర్లలోనే 200 పరుగుల మైలురాయి దాటింది. ఇన్నింగ్స్ 16వ ఓవర్లో జేమ్స్ నీషమ్ గొప్పగా బౌలింగ్ చేశాడు. సంజు శాంసన్, ఇషాన్ కిషన్ సహా సూర్యకుమార్ యాదవ్ (0)ను అవుట్ చేశాడు. జేమ్స్ నీషమ్ ఓ ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టగా.. భారత్ స్కోరు నెమ్మదించింది. 16-19 ఓవర్లలో భారత్ 28 పరుగులే (24 బంతుల్లో) చేసింది. 300 స్కోరుపై అభిమానులు ఆశలు పెట్టుకోగా.. 250 కొట్టినా సంతోషమే అనిపించింది. ఆఖరు ఓవర్లో శివం దూబె (26 నాటౌట్) శివమెత్తాడు. ఫోర్లు, సిక్సర్లతో దంచికొట్టాడు. చివరి 6 బంతుల్లో 24 పరుగులు పిండుకున్నాడు. దీంతో భారత్ 255 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్య (18, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), తిలక్ వర్మ (8 నాటౌట్, 6 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. లక్షలాది గొంతుకల జయజయ ధ్వానాల మధ్య, అహ్మదాబాద్ వేదికగా 'విశ్వరూపం' ప్రదర్శించింది. ఆదివారం జరిగిన తుది పోరులో బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆధిక్యతను ప్రదర్శించి, న్యూజిలాండ్‌ను మట్టికరిపించి, టీమ్ ఇండియా 'జగజ్జేత'గా పట్టాభిషేకం చేసుకుంది.

# పడిలేచిన కెరటం.. సంజు శాంసన్



2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న వికెట్ కీపర్-బ్యాటర్ సంజూ శాంసన్ తన విజయ రహస్యాన్ని వెల్లడించాడు. తన అద్భుత ప్రదర్శన వెనుక దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మార్గదర్శనం ఉందని తెలిపాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రజెంటేషన్ వేడుకలో శాంసన్ ఈ విషయాలను పంచుకున్నాడు. "గత కొన్ని నెలలుగా నేను సచిన్ టెండూల్కర్ సర్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నాను. ఆస్ట్రేలియాలో మ్యాచ్‌లు ఆడే అవకాశం రాక, బయట కూర్చున్నప్పుడు.. ఎలాంటి మైండ్‌సెట్‌తో ఉండాలని ఆలోచించాను. ఆ సమయంలో సచిన్ సర్‌ను సంప్రదించి చాలా విషయాలు చర్చించాను. ఫైనల్ మ్యాచ్‌కు ముందు రోజు కూడా ఆయన నాకు ఫోన్ చేసి ఎలా ఫీల్ అవుతున్నావని అడిగారు. ఆయన నుంచి లభించిన మార్గదర్శనం, ఆటపై స్పష్టత, సన్నద్ధతకు నేను ఎంతో రుణపడి ఉంటాను" అని శాంసన్ వివరించాడు. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్ కూడా ఆడని శాంసన్.. ఈసారి సూపర్-8లో జింబాబ్వేతో మ్యాచ్ నుంచి తిరిగి జట్టులోకి వచ్చాడు. కీలకమైన మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించాడు. వెస్టిండీస్‌పై 97 నాటౌట్, ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌లో 89 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో మొత్తం 321 పరుగులు సాధించాడు. "ఇదంతా ఒక కలలా ఉంది. చాలా సంతోషంగా, కృతజ్ఞతగా ఫీల్ అవుతున్నాను. న్యూజిలాండ్‌తో సిరీస్ తర్వాత నా కలలన్నీ చెదిరిపోయాయని భావించాను. కానీ దేవుడి ప్రణాళికలు వేరేలా ఉన్నాయి. కీలకమైన మ్యాచ్‌లలో తిరిగి జట్టులోకి వచ్చి దేశం కోసం నా వంతు కృషి చేయగలిగాను" అని శాంసన్ భావోద్వేగంతో అన్నాడు.





# 19న థియేటర్స్‌లోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'



అంచనాలం ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉత్సాహం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. సినీ ప్రి యులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి తాజాగా విడుదలైన శక్తివంతమైన గ్లింప్స్ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేపుతోంది. పవన్ కళ్యాణ్ అద్భుతమైన, కమాండింగ్ అవతార్‌లో కనిపించిన ఈ గ్లింప్స్.. ప్రేక్షకులు తెరపై చూడటానికి ఇష్టపడే మాస్ ఎనర్జీ, చరిష్మాను సంపూర్ణంగా సంగ్రహించింది. ఈ గ్లింప్స్ విడుదలైన క్షణం నుంచే సామాజిక మాధ్యమాల్లో అద్భుతమైన స్పందన లభిస్తోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, ప్రభావవంతమైన డైలాగులు,శక్తివంతమైన బాడీ లాంగ్వేజ్ అభిమానులు, ప్రేక్షకులను ఎంతో ఆకట్టు కుంటున్నాయి. ఈ చిన్న గ్లింప్స్ ఇప్పుడు సినీ ప్రియుల్లో చర్చనీయాంశంగా మారింది. అభిమానులచే 'కల్ట్ కెప్టెన్' అని ప్రశంసించబడే దర్శకుడు హరీష్ శంకర్, ప్రేక్షకులు ఆరాధించే విధంగా పవన్ కళ్యాణ్‌ను మరోసారి ఉత్తేజపరిచే రీతిలో ప్రదర్శించడంలో సఫలమయ్యారు. ఈ గ్లింప్స్ సినిమా యొక్క తీవ్రతను, పవర్ స్టార్ పాత్రను మరింత బలంగా చూపించే విధంగా రూపొందించబడింది. గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనపై చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఇది చిన్న భాగం మాత్రమేనని, త్వరలో విడుదల కానున్న ట్రైలర్‌తో మరింత ఉత్సాహం పెరుగుతుందని చిత్రబృందం హామీ ఇచ్చింది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి పాటలను స్వరపరచగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ప్రేక్షకులను డ్యాన్స్ చేయిస్తే, తమన్ తన నేపథ్య సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళనున్నారు.

# ఆ నిర్మాత వల్ల నెల రోజులు ఖాళీగా ఉన్నా: ఆదాశర్మ



బాలీవుడ్ నటి ఆదా శర్మ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని అభిమానులతో పంచుకున్నారు. డేట్స్ సర్దుబాటు చేసే క్రమంలో ఓ నిర్మాత తన మేనేజర్‌ను బూతులు తిట్టారని, ఆ నిర్మాత తీరు వల్ల తాను నెల రోజుల పాటు ఎలాంటి పని లేకుండా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. తాను ఒకే సమయంలో మూడు సినిమాలకు అంగీకరించానని, అయితే మొదటి సినిమా డేట్స్ పదే పదే మారడంతో మిగతా రెండు ప్రాజెక్టుల షెడ్యూల్స్‌కు ఇబ్బంది వచ్చిందని ఆదా తెలిపారు. అయినా సరే మొదటి సినిమా నిర్మాత తనకు ఆ పలానా తేదీలే కావాలని పట్టుబట్టారని, ఈ క్రమంలో తన మేనేజర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని ఆమె వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా ఇద్దరు దర్శకులు చాలా హుందాగా వ్యవహరించి తమ షూటింగ్ తేదీలను మార్చుకున్నారని ఆదా వివరించారు. మూడో సినిమా నిర్మాత అయితే తనకోసం ఏకంగా ఇతర నటీనటుల డేట్స్ కూడా అడ్జస్ట్ చేశారన్నారు. "ఇండస్ట్రీలో చెడ్డవాళ్లే కాదు, మంచివాళ్లు కూడా ఉన్నారని చెప్పడానికే ఈ విషయం చెబుతున్నా" అని ఆమె అన్నారు. అయితే, అందరూ సర్దుబాటు చేసుకున్నాక, మొదటి సినిమా నిర్మాత మాత్రం తనకు ఇప్పుడు ఆ డేట్స్ వద్దని చెప్పడంతో తాను మానసికంగా, ఆర్థికంగా దెబ్బతిన్నానని ఆదా వాపోయారు. ఇదే సమయంలో 'ది కేరళ స్టోరీ' సీక్వెల్‌లో తాను ఎందుకు నటించడం లేదన్న దానిపై కూడా ఆదా శర్మ స్పందించారు. తాను భాగం కాని సినిమా గురించి వార్తల్లో నిలవడం కోసం మాట్లాడటం సరికాదన్నారు. తనకు సీక్వెల్‌లో అవకాశం వచ్చిందా లేదా అనేది మేకర్స్, తన మధ్య ఉండాల్సిన విషయమని స్పష్టం చేశారు. మొదటి భాగం ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐసిస్ క్యాంపుల నేపథ్యంలో సాగితే, రెండో భాగం పూర్తిగా భిన్నమైన కథ అని ఆమె తెలిపారు.

# విశాల్ హీరోగా 'మొగుడు'




విశాల్, సుందర్. సి కాంబోలో ఇది వరకు వచ్చిన 'ఆంబళ', 'మద గద రాజా' చిత్రాలు బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. ఇక ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టే క్రమంలో ఈ ఇద్దరూ కలిసి 'మొగుడు' అనే మూవీ చేస్తున్నారు. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. డా. ఎ.సి. షణ్ముఖం ఆశీస్సులతో అవని సినిమాస్ ప్రై.లి., బెంజ్ మీడియా ప్రై.లి. బ్యానర్లపై ఈ మూవీని అరుణ్ కుమార్, ఖుష్బూ సుందర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నవదీప్, సంపత్, అజరు ఘోష్, గరుడ రామ్, వీటీవీ గణేష్, యోగి బాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. 'మొగుడు' సినిమాకి సంబంధించిన టైటిల్ ప్రోమోను ఇదివరకే రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఓ సాధారణ మొగుడిలా ఇంట్లో అన్ని పనులు చేస్తూనే.. అండర్ కవర్ పోలీస్‌లా రౌడీలను చితక్కొట్టేశాడు విశాల్. అన్ని రకాల అంశాల్ని జోడించిన ఈ మూవీని ఫుల్ మాస్ కమర్షియల్ యాంగిల్‌లో సుందర్. సి ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్టుగా టైటిల్ ప్రోమోతో చెప్పకనే చెప్పేశారు. ఇక సుందర్. సి ఇప్పటి వరకు తీసిన 40కి పైగా చిత్రాలకు మాస్ ఆడియెన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఈ 'మొగుడు' మూవీని కూడా వాటికి ఏ మాత్రం తగ్గకుండా ఉండేట్టు ప్లాన్ చేసుకుంటున్నారు.

'మొగుడు' టీం ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ఇక నెక్స్ట్ షెడ్యూల్‌ను కోల్ కత్తా , గోవా , చెన్నై ల్లో ప్లాన్ చేశారు. ఈ మూవీకి హిప్‌హాప్ తమిళ సంగీతాన్ని అందిస్తున్నారు. రోడ్జర్ ఎడిటర్‌గా, గోపీ అమర్ నాథ్ కెమెరామెన్‌గా, గురు రాజ్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**